# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.
- ❖ లాభసాటి వ్యవసాయం ద్వారా రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు.
- ❖ రాష్ట్రంలో రహదారుల మరమ్మతుల కోసం 1,061 కోట్ల రూపాయలతో పనులు చేపట్టామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు.
- ❖ యోగాంధ్ర కార్యక్రమాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఈ రోజు జరిగిన యోగాభ్యసనలో పెద్ద ఎత్తున వయోజనులు పాల్గొన్నారు.

=====================

లాభసాటి వ్యవసాయం ద్వారా రైతులు ఆర్థికంగా ఎదగాలన్నదే కూటమీ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు మండలం లంకలకోడేరులో ఈ రోజు రైతులకు రాయితీపై ట్రాక్టర్లను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యవసాయంలో యాంత్రీకరణను ప్రోత్సహించేందుకు ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజన్లు, వరి కోత యంత్రాలు సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. రైతులకు మేలు చేసేందుకు.. పంట కాలువలను ఆధునీకరించి, పంట పొలాలకు రహదారులు నిర్మిస్తున్నామని తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

దేశ ప్రగతి మహిళల సాధికారతతో లోతుగా ముడిపడి ఉందని గుర్తించిన భారత ప్రభుత్వం గత 11 సంవత్సరాల్లో దేశ ప్రగతి ప్రయాణంలో నారీశక్తికి పెద్దపీట వేసింది. వివిధ దశల్లో వారికి సాధికారతతో పాటు సామాజిక ఆర్థిక అడ్డంకులు దాటిన మద్దతునిస్తూ... మహిళా సంక్షేమ కార్యక్రమాలను రూపొందించింది. భారత సాయుధ దళాలు తొలిసారిగా నేషనల్

డిఫెన్స్ అకాడమీలో మహిళలకు ప్రవేశం కల్పించాయి. లోక్ సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించారు. పిల్లలు, కౌమార బాలికలు, గర్భిణీలు, పిల్లలకు పాలిచ్చే తల్లుల్లో పోషకాహార లోపం సరి దిద్దేందుకు మిషన్ పోషన్ 2.0 అమలు చేస్తోంది. మహిళల ఆర్ధిక స్వావలంభనకు 14 లక్షల 72 వేల కోట్ల రూపాయల ముద్రా రుణాలను మంజూరు చేసింది. మహిళలు సాధిస్తూన్న విజాయాలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ... మహిళలు శరవేగంగా పురోగమిస్తూ... ప్రతి రంగంలో సారధ్య పాత్ర పోషిస్తూ... విధాన రూపకల్పనకు దోహదపడుతున్నారని, మొత్తం నారీ శక్తి మరింత కీలకపాత్ర పోషించడం చాలా ముఖ్యమని అన్నారు.

=====================

అమరావతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించే యోచన చేస్తున్నామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడలో ఈ రోజు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశ అనంతరం ఎంపీ మాట్లాడుతూ... ప్రపంచ స్థాయి స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వానికి 65 ఎకరాల భూమి కావాలని కోరామని తెలిపారు. అమరావతి రాజధాని పరిధిలో నిర్మిస్తున్న స్పోర్ట్స్ సిటీలో క్రికెట్ స్టేడియం నిర్మిస్తామని స్పష్టం చేశారు. విశాఖలో 5 మహిళల క్రికెట్ ప్రపంచ కప్ మ్యాచులు జరుగుతాయని, ఈ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాలో క్రికెట్ స్టేడియాలను నిర్మిస్తామని, కర్నూలు, నెల్లూరులో ముందుగా నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. త్వరలో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని ప్రకటించారు.

విరామం

=====================

ప్రజల ఆరోగ్య పరిరక్షణ కు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరు నగరంలో ఈరోజు జరిగిన పలు కార్యక్రమాల్లో నెల్లూరు లోక్ సభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలు ఆరోగ్యంగా ఉంటే అభివృద్ధి సాధ్యమని, పరిపూర్ణ ఆరోగ్య సాధనకు యోగాను జీవితంలో భాగం చేసుకోవడంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ నెల 21వ తేదీన విశాఖలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నదని మంత్రి తెలిపారు.

=====================

యోగాంధ్ర కార్యక్రమాలలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలలో ఈ రోజు వయోజనులు సామూహిక యోగాభ్యాసన చేశారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో ఈరోజు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా సాధన కార్యక్రమంలో 200 మంది వయోవృద్ధులు పాల్గొన్నారు. ప్రతి రోజు కనీసం 30 నిమిషాల పాటు యోగ సాధన చేయాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ మధులత మాట్లాడుతూ అన్నారు. శ్రీకాకుళం నగరంలో వృద్ధాశ్రమంలో ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమంలో వయో వృద్ధులు, మధ్యవయస్కులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకులు కె.కవిత అన్నారు. విశాఖపట్నం జిల్లాలో విశాఖ పోర్టు స్టేడియంలో నిర్వహించిన యోగాంధ్ర వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పర్యాటక శాఖ అధికారిణి జె. మాధవి మాట్లాడుతూ.... అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని కోరారు.

=====================

రాష్ట్రంలో రహదారుల మరమ్మతుల కోసం 1,061 కోట్ల రూపాయలతో పనులు చేపట్టామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్లలో నంద్యాల నుంచి జమ్మలమడుగు వరకు జాతీయ రహదారి నిర్మాణానికి మంత్రి ఈ రోజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... 62 కిలో మీటర్ల రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 691 కోట్ల 81 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసిందన్నారు. ఈ రహదారి నిర్మాణంతో నంద్యాల, కడప నుండి హైదరాబాద్ ప్రయాణానికి 70 కిలోమీటర్ల దూరం తగ్గనుందని తెలిపారు. నాబార్డ్

ద్వారా 400 కోట్ల రూపాయలతో రాష్ట్రంలో రహదారుల పునరుద్ధరణకి ఇప్పటికే అనుమతులు ఇచ్చామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

విశాఖపట్నం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రేపు నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీ.జీ.ఆర్.ఎస్.) కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని కలెక్టర్ కార్యాలయం ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పదవ తగతి, ఇంటర్మీడియట్ ఉత్తమ విద్యార్థులకు అవార్డులు అందించే షైనింగ్ స్టార్స్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తో పాటు ప్రధాన విభాగాల అధికారులు హాజరవుతున్న నేపధ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటనలో తెలిపారు.

======================

ఆంధ్రప్రదేశ్ లో ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్-2025 ఫలితాలు ఈ రోజు విడుదల అయ్యాయి. ఈ ఫలితాలను జేఎన్టీయూ-కాకినాడ ఉప కులపతి ఆచార్య సీఎస్ఆర్కే ప్రసాద్ విడుదల చేశారు.

======================

======================